సాక్షి చిత్తూరు

మంగళవారం । 2 । జనవరి । 2024



'కొత్త' ఆశలతో స్వాగతం

నూతన సంవత్సర వేడుకలను పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. - 8లో



వరసిద్ధుని సేవకు పోటెత్తిన భక్తులు

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. - 8లో



విద్యను అందిస్తూ..

విజయపురం మండలంలోని ఐటీఐలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందిస్తున్నారు. నూతన భవనం నిర్మిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

జిల్లాకు కోవిడ్ టెస్ట్ కిట్‌లు

చిత్తూరు రూరల్: కోవిడ్ కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. కోవిడ్ టెస్ట్ కిట్‌లు మంజూరు చేసింది. ఈ మేరకు ఆదివారం రాత్రి జిల్లాకు ర్యాపిడ్ కిట్లు 500, ఆర్‌టీపీఎస్‌పీసీఆర్ కిట్లు 5వేలు చేరుకున్నాయి. సోమవారం ఉదయం జిల్లాలోని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు అధికారులు పంపిణీ చేశారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో కార్మికశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ నిర్మాణాలు చేపట్టేవారు కార్మిక బోర్డుకు సక్రమంగా పన్ను చెల్లించాలన్నారు. నూతన సంవత్సరంలో తొలుత కార్మికుల సంక్షేమానికి సంబంధించిన సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందని చెప్పారు. యజమానుల నుంచి వసూలు చేసే పన్నులను కార్మికుల సంక్షేమానికి వెచ్చిస్తామని వెల్లడించారు. ఇందుకో లబ్ధిదారుగా నమోదు చేసుకోవాలంటే 18 నుంచి 59 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అలాగే కార్మికుడు భవన, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తూ ఉండాలని సూచించారు. నమోదు కోసం రూ.110 చెల్లించాలని తెలిపారు. ఇప్పటికే నమోదు చేసుకున్నవారు ఐదేళ్ల రెన్యూవల్ కోసం రూ.60 చెల్లించాలని వివరించారు. ఈ పథకం కింద భవన నిర్మాణ పనుల్లో కార్మికుడికి ఏదైనా ప్రమాదం జరిగితే బీమా పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్, డ్వామా పీడీ గంగాభవానీ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా చాముండేశ్వరి

చిత్తూరు కలెక్టరేట్ : ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ గా చాముండేశ్వరిని నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కర్నూలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఆమె ఉద్యోగోన్నతితో జిల్లాకు రానున్నారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి జిల్లా కో–ఆర్డినేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గురుస్వామిరెడ్డి పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌గా కొనసాగనున్నారు.


స్విమ్స్‌లో ఉచిత టీకాలు



చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ ఆర్వీ కుమార్

తిరుపతి తుడా: స్విమ్స్ శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల పీడియాట్రిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత టీకాల (రోగ నిరోధక సేవలను) కేంద్రాన్ని సోమవారం డైరెక్టర్ ఆర్వీ.కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెలా మొదటి వారం 1 నుంచి 7వ తేదీ వరకు మెగా క్యాంపెయిన్ లాగా ఈ ఉచిత టీకాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వెల్లడించారు. పురిటి బిడ్డ నుంచి పదేళ్ల వయసు పిల్లలకు ఉచితంగా టీకాలు వేయనున్నట్టు వెల్లడించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, శ్రీపద్మావతి మహిళా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణబిట్ల, పీడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పునీత్ పాల్గొన్నారు.

'అమృత్ భారత్'కు స్వాగతం



రేణిగుంటలో రైలుకు స్వాగతం పలుకుతున్న నేతలు

రేణిగుంట: భారతీయ రైల్వే ప్రవేశపెట్టిన సరికొత్త రైలు 'అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్' సోమవారం రేణిగుంట జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా రైల్వే అధికారులు ఘన స్వాగతం పలికారు. పశ్చిమబెంగాల్‌లోని మాల్దా– బెంగళూరు మధ్య నడిచే ఈ రైలును గత ఏడాది డిసెంబర్ 30న భారత ప్రధాని ప్రారంభించారు. మొత్తం 32 స్టాపులు ఉన్న ఈ రైలు సోమవారం రేణిగుంటకు చేరుకుంది. ఈ సూపర్ ఫాస్ట్ ట్రైన్‌లో మొత్తం 16 స్లీపర్ కోచ్‌లు, 8 జనరల్ కోచ్‌లు ఉన్నాయి. తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, రేణిగుంట అసిస్టెంట్ డివిజన్ ఇంజినీరు హరికృష్ణారెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

"ప్రతి పల్లెనూ అభివృద్ధి చేశాం .. ఎక్కడికక్కడ రోడ్లు వేయించాం.. మురుగునీటి కాలువలు నిర్మించాం.. దాహార్తిని తీర్చేందుకు పకడ్బందీగా తాగునీరు అందిస్తున్నాం.. నిరుపేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయించాం.. వేలాది గృహాలను వేగంగా పూర్తి చేయిస్తున్నాం.. వ్యవసాయానికి భరోసా కల్పించేందుకు సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం.. చంద్రబాబు అడ్డుపడి రైతులకు అన్యాయం చేశారు.. తన నైజానికి తగ్గట్టుగా మళ్లీ మోసాలకు తెరతీశారు.. స్వార్థ ప్రయోజనాల కోసం జనం గొంతు కోస్తున్నారు" అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం రొంపిచెర్లలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేశారు.

పల్లెల్లో అభివృద్ధి ఫలాలు



సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, వేదికపై ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జేసీ శ్రీనివాసులు తదితరులు

- ప్రతి గ్రామానికి పక్కాగా రోడ్లు
- పైప్‌లైన్ ద్వారా గండికోట జలాలు
- సాగునీటి ప్రాజెక్టులను అడ్డుకుంది చంద్రబాబే
- ప్రజలను మోసం చేయడమే ఆయన నైజం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వెల్లడి



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి, ఎంపీలు



సభకు హాజరైన మహిళలు

రొంపిచెర్ల : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్మిస్తున్న సాగు నీటి ప్రాజెక్టులను కోర్టుల్లో కేసులు వేయించి అడ్డుకుంది చంద్రబాబే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. సోమవారం రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న ప్రాజెక్టు పూర్తయితే సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల, పీలేరు మండలాలకు సాగు, తాగునీటి కష్టాలు ఉండవన్నారు. చంద్రబాబు వేయించిన కేసుపై ఈ నెలలో వాదనలు జరిగే అవకాశముందని, అనుకూలంగా తీర్పువస్తే రాబోయే ఎన్నికల నాటికే ప్రాజెక్టు పనులు పూర్తి చేసేస్తామని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధి పథకాలను మంజూరు చేశామని తెలిపారు. ఓటీయని గ్రామాల్లో సైతం ట్యాంక్‌లను నిర్మించి గండి కోట నుంచి తాగునీటిని పైపులైన్ ద్వారా అందించే పనులు వేగంగా సాగుతున్నాయని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో తారురోడ్లు, సీసీ రోడ్లు, మురుగు నీటి కాలవలు నిర్మించామన్నారు. 15 వేల ఇళ్లను మంజూరు చేయించామని, అందులో 14 వేల గృహాల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ప్రజలు మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించారని విమర్శించారు. టీడీపీకి ఓటేస్తే ప్రజలకు క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సచివాలయాలు, వలంటీర్లను తొలగిస్తారని హెచ్చరించారు. ఎన్నికల హామీలన్నీ నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్, చంద్రబాబు పాలనలను బేరీజు వేసుకోవాలని సూచించారు. కుప్పంలో కూడా చంద్రబాబును ఇంటికి పంపేయడం ఖాయమని వెల్లడించారు. అనంతరం 369 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జేసీ శ్రీనివాసులు, డీపీఓ లక్ష్మి, ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇబ్రహీంఖాన్, నాయకులు చెంచురెడ్డి, నూలు రెడ్డెప్ప, కోటా వెంకటరమణ, డాక్టర్ శ్రీనాథ్, విజయశేఖర్, కె.రవీంద్రనాథరెడ్డి, కరీముల్లా, తహసీల్దార్ అమరనాథ్, ఎంపీడీఓ రాజేంద్ర పాల్గొన్నారు.



ఆలయంలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి

అయ్యప్ప సేవలో..

సదుం: మండలంలో ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామివారిని సోమవారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. స్వామితో పాటు ఆలయంలోని వినాయక, ఆంజనేయ, నాగమల్లేశ్వరుని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవళంపేటలో..

పులిచెర్ల(కల్లూరు): దేవళంపేటలో వెలసిన కాశీ విశ్వేరస్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాథమునిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు హేమసుందరరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేత



మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు ఆది నారాయణరెడ్డి

మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులుపేటకు చెందిన టీడీపీ నేత ఆదినారాయణరెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరారు. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడైన ఆదినారాయణరెడ్డికి ప్రభుత్వం ఇంటి పట్టా మంజూరు చేసింది. పార్టీలకు అతీతంగా సేవలందిస్తున్న జగనన్నకు అండగా నిలవాల్సిన బాధ్యత తనపై ఉండడంతోనే వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ఆదినారాయణరెడ్డి వెల్లడించారు. మంత్రి పెద్దిరెడ్డి చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులైనట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, కోటా వెంకటరమణ పాల్గొన్నారు.

పింఛన్.. పెంచెన్

రాజకీయాల్లో ఇచ్చిన మాటకు కట్టుబడేవాళ్లు అరుదుగా ఉంటారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ కోవకు చెందిన వారే. సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఏటా పింఛన్ల మొత్తం పెంచుతూ పోతున్నారు. వయసుడిగిన అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారు. ఒంటరి మహిళలు, వితంతవులకు ఆపన్న హస్తం అందిస్తున్నారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. కొత్త ఏడాదిలో సరికొత్తగా పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచి ఆదర్శంగా నిలుస్తున్నారు. నా మనవడు, ఇంటి పెద్దకొడుకు పండగకు కానుక ఇచ్చాడంటూ లబ్ధిదారులు మురిసిపోతున్నారు.

కొత్త ఏడాదిలో పెద్దకొడుకు కానుక

- ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు పింఛన్
- ఏటా కొత్త పెన్షన్లకూ ఢోకాలేదు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- అవ్వాతాతల కళ్లల్లో ఆనందం
- సీఎం జగన్‌కు అభినందనల వెల్లువ



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

సాక్షి, తిరుపతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి (చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 2019 నుంచి 2024 జనవరి వరకు) 5,50,902 మందికి రూ.6,322.40 కోట్ల మేర పింఛన్లు పంపిణీ చేసింది. 2014–15 నుంచి 2018–19 వరకు టీడీపీ హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పింఛన్ల పంపిణీకి సంబంధించి రూ.1,572 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఏటా పింఛన్ల పంపిణీని పెంచుకుంటూ పోతున్నారు. అంతేకాకుండా కొత్తగా అర్హులెవరైనా తప్పిపోయి ఉంటే వారిని ఎలాంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేసి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. గ్రామ, వార్డు వలంటీర్ల ద్వారా ప్రతినెలా ఒకటో తేదీ పొద్దుటే తలుపుతట్టి గుడ్ మార్నింగ్ చెప్పిమరీ చిక్కటి చిరునవ్వుతో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నారు. సెలవులు, పండుగ రోజులైనా పింఛన్లు ఆపకుండా అవ్వాతాతల కళ్లల్లో ఆనందం నింపుతున్నారు.

ఎంతెంత లబ్ధి అంటే

- 2014–19 మధ్య వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళల పెన్షన్ కేటగిరీలో ఒక్కో లబ్ధిదారుడు పొందిన పింఛన్ మొత్తం రూ.58,000
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్కో లబ్ధిదారునికి అందిస్తున్న మొత్తం రూ.1,47,500, దివ్యాంగులకు రూ.1,82,000

పెంచి..ఆనందాన్ని పంచి!

- జులై 2019 నుంచి పెన్షన్ రూ.2,250కు పెంపు
- జనవరి 2022న రూ.2,500
- జనవరి 2023న రూ.2,750
- జనవరి 2024న రూ.3వేలకు పెంపు

నాడు అలా..

- గత టీడీపీ హయాంలో పింఛన్లు తీసుకోవాలంటే లబ్ధిదారులు నానా అవస్థలు పడేవారు. లంచాలు, కుట్రలు, కుతంత్రాల కోటలు దాటితేనే పింఛన్ మంజూరయ్యేది. ఎవరైనా చనిపోతేగానీ కొత్తవారికి పింఛన్ వచ్చేది కాదు. వర్గం, పార్టీ, తారతమ్యాలు చూసి పింఛన్లు ఇచ్చేవారు. ఇక జన్మభూమి కమిటీలకు లంచాలు ఇస్తేనే వృద్ధులు, వికలాంగులకు పింఛన్ వచ్చేది.

నేడు ఇలా

- కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా లంచాలు, వివక్ష, అశ్రిత పక్షపాతానికి తావులేకుండా అర్హులందరికీ సంతృప్తి స్థాయిలో పింఛన్లు మంజూరు చేస్తున్నారు. అర్హులైన ఉండి ఒకవేళ ఏ కారణంచేత అయినా పింఛన్ పొందని వారికి మరో అవకాశాన్ని కల్పిస్తున్నారు. ప్రతి ఏటా జూన్, డిసెంబర్‌లో బైయాన్యువల్ శాంక్షన్ల ద్వారా ఎంపిక చేసి పింఛన్లు మంజూరు చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో లబ్ధిదారుల జాబితాలు ప్రదర్శించి మరీ, సోషల్ ఆడిట్ ద్వారా లబ్ధిదారులు ఎంపిక చేస్తున్నారు. అర్జీ పెట్టుకున్న 21 రోజుల్లో అర్హులకు పెన్షన్ కార్డులు మంజూరు చేస్తున్నారు.


ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో..

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లలో
2019–20	4,98,459	రూ.1296.04
2020–21	5,23,076	రూ.1424.20
2021–22	5,26,871	రూ.1500.69
2022–23	5,51,705	రూ.1938.54
2024 జనవరి	5,50,902	రూ.162.93

కొత్తగా మంజూరు చేసిన పింఛన్లు

సంవత్సరం	కొత్త ఫించన్‌లు
2019-20	24,617
2020-21	3,795
2021-22	17,779
2022-23	24,834
2024 జనవరి	7,322


మా పెద్దకొడుకులా..



మాది నిరుపేద కుటుంబం. కరోనాతో భర్త చనిపోయాడు. వృద్ధాప్యంతో కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి. అప్పటి టీడీపీ హయాంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాను. జన్మభూమి కమిటీల వారు కాళ్లరిగేలా తిప్పించుకున్నారు. వారి ఆమోదం లేనిదే పింఛన్ మంజూరు చేయమని అధికారులు తేల్చిచెప్పారు. ఈ ప్రభుత్వ వచ్చాక వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి పింఛన్‌కు దరఖాస్తు చేయించి మంజూరు చేయించారు. నాకు ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ ఇంటికొచ్చి ఇస్తున్నారు. నాకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద కొడుకుతో సమానం.

– ఆర్ లీలావతి, సీఎస్‌ఆర్ కాలని, తిరుపతి.

జగనన్న వల్లే..



గత ప్రభుత్వం 65 సంవత్సరాలు పూర్తయితేనే పింఛన్ ఇస్తామని చెప్పారు. సరేలే అని దరఖాస్తు చేసుకోలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక వయస్సు 60 ఏళ్లకు తగ్గించారు. అంతేగాకుండా వలంటీరే ఇంటికొచ్చి నా పేరుతో పింఛన్ కోసం దరఖాస్తు చేశారు. మూడేళ్లుగా పింఛన్ వస్తోంది. జనవరి నుంచి రూ.3వేలు ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది. అంతా ఆ మహానుబావుడు జగన్ దయ వల్లే..!

– ఎస్.గుల్జార్, బీ.ఎన్‌ఆర్‌పేట, చిత్తూరు రూరల్ మండలం

అర్హులందరికీ ఫించన్‌లు



జిల్లా వ్యాప్తంగా అర్హులందరికీ ఫించన్‌లు అందేలా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా ఒకటో తేదీన పకడ్బందీగా పంఛన్లు పంపిణీ చేస్తున్నాం. 2024 జనవరి 1 నుంచి రూ.2,750 నుంచి రూ.3 వేల వరకు పింఛన్ పెంచి మరీ ఇస్తున్నాం. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చు. **– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు.**

అర్హతే ప్రామాణికం



అర్హులైన వారికి ఈనెల నుంచి పింఛన్ రూ.3వేలు అందజేస్తాం. అర్హతే ప్రమాణికంగా పింఛన్లు అందజేస్తున్నాం. జిల్లాలో ఈ నెల ఏడో తేదీ వరకు పింఛన్లు పంపిణీ చేస్తాం. సోమవారం వెంకటగిరిలో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

తలుపుతట్టి ఫించన్ ఇస్తున్నారు



నా భర్త మృతిచెందాడు. ప్రతి నెలా ఒకటో తేదీ రాగానే మా ఇంటి తలుపు తట్టి మరీ వలంటీర్ ఫించన్ అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలా ఒకటో తేదీన ఫించన్ ఇచ్చిన దాఖలాలు లేవు. గంటల కొద్దీ మండల కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది.

– చిన్నక్క, ప్రశాంత్ నగర్, కొత్తపేట 24వ వార్డు పుంగనూరు మున్సిపాలిటీ.

ప్రజాసేవకు పునరంకితం



డిప్యూటీ సీఎం నారాయణస్వామికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నేతలు

కార్వేటినగరం : ప్రజాసేవకు నేతలు, కార్యకర్తలు పునరంకితం కావాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి పిలుపునిచ్చారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా పెద్దసంఖ్యలో ప్రజాప్రతినిధులు, శ్రేణులు, అభిమానులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఐకమత్యంతో పనిచేసి రాబోయే న్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా శ్రమిస్తున్న ప్రభుత్వంగా ఇప్పటికే ప్రపంచస్థాయి ఖ్యాతి దక్కిందని వెల్లడించారు. చరిత్రలో నిలిచేలా జగనన్న ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అందించారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయ వర్మ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోకనాథరెడ్డి, తుడా ప్లానింగ్ విశ్రాంతి అధికారి కృష్ణారెడ్డి, హేమారెడ్డి, ఉప సర్పంచ్ శేషాద్రివర్మ, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షులు యశోదారెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ వివేకానందరెడ్డి, దూది మోహన్ పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

వెదురుకుప్పం : ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణ స్వామి తెలిపారు. సోమవారం పుత్తూరులోని తన క్యాంపు కార్యాలయంలో తిరుపతి డీఎంహెచ్‌ఓ శ్రీహరి, వైద్యాధికారులతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. ఈక్రమంలోనే ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచినట్లు వివరించారు. రేషన్ కార్డు చూపించినా ఉచితంగా ఆపరేషన్లు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టంగా ఆదేశించారని తెలిపారు. ఈ మేరకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రులకు అవసరమైన మందులను ప్రభుత్వానికి నివేదిక ద్వారా తెలియజేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు.

క్లుప్తంగా

గంజాయి తరలిస్తున్న మహిళల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఈబీ అధికారులు

కుప్పం : విశాఖపట్నం నుంచి తమిళనాడులోని కృష్ణగిరికి 12 కిలోల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహిళలను కుప్పం రైల్వేస్టేషన్‌లో ఎస్‌ఈబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులు విశాఖపట్నం సమీపంలోని రోలుకుంట మండలం బెన్న భూపాలపతనం ఎస్సీ కాలనీకి చెందినా లోవలక్ష్మి, కృష్ణగిరికి చెందిన మల్లికగా గుర్తించారు. ఈ మేరకు కేస నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

తిరుమల ఘాట్ రోడ్‌లో ప్రమాదం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు .. తమిళనాడు కాంచీపురానికి చెందిన ఆనంద్ మురుగన్, మురుగన్ సుబ్బరాజు, మరో ముగ్గురు కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనానంతరం తిరుమల నుంచి తిరుపతికి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్ రోడ్డు మీదుగా దిగుతుండగా 30వ మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై నుంచి కారు అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో స్వల్ప గాయాలతో భక్తులు బయటపడగా వారిని వెంటనే ఘాట్‌రోడ్డు సిబ్బంది రుయా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

'కొత్త' ఆశలతో స్వాగతం!



క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. అధికారులు.. సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ క్రమంలోనే కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులుకు అన్ని శాఖల ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందించారు. ఆయన కేటక్ కట్ చేసి పంచిపెట్టారు. డీఆర్‌ఓ రాజశేఖర్‌ను వివిధ సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిసి హ్యాపీ న్యూఇయర్ చెప్పారు. డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఉపాధ్యాయ అసోసియేషన్ నాయకులు ఆవిష్కరింపజేశారు.

ఎస్పీ కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ రిశాంత్ రెడ్డికి అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి గజమాలతో సత్కరించారు. ఆయన కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మీ, నాగేశ్వరరావు, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సేవలు

పుత్తూరు: నూతనం సంవత్సరం సందర్భంగా డీఎస్పీ వై.శ్రీనివాసరావు తన సిబ్బందితో కలిసి పట్టణంలోని మెక్గా వృద్ధాశ్రమంలో సేవలందించారు. వృద్ధులతో కేక్ కట్ చేయించారు. పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐలు గౌరీశంకర్, వెంకటమోహన్ పాల్గొన్నారు.



యూటీఎఫ్ డైరీ ఆవిష్కరిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్



డీఈఓ విజయేంద్రరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది



ఎస్పీని సత్కరిస్తున్న పోలీసు అధికారులు



వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వరసిద్ధుని సేవకు పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిన క్యూ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా వేకువ జామున 3 గంటల నుంచే స్వామివారి దర్శనం ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో క్యూలు నిండిపోయాయి. వృద్ధులు, చంటి బిడ్డల తల్లిదండ్రులకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. వీఐపీలకు ప్రత్యేక సమయం కేటాయించి స్వామివారి దర్శనం కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు.



భక్తులకు తాగునీరు, ప్రసాదం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు

ఆకట్టుకున్న అలంకరణ

న్యూ ఇయర్‌ను పురస్కరించుకుని వరసిద్ధుని ఆలయాన్ని విశేషంగా అలంకరించారు. సుగంధ సుమాలు, విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోసింహ కుటుంబ సమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా.. అధికారులు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయ ధ్వజస్తంభం వద్ద తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీకాళహస్తీశ్వరాలయం తరపున నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జమ్ముకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన వరదరాజులు

వి.కోట: మండలంలోని పాపేపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. తమిళనాడులోని వేలూరు జిల్లా పేర్నంబట్ తాలూకా ఏరుగుత్తి గ్రామానికి చెందిన వరదరాజులు (57) వి.కోటలో తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో వి.కోటకు వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో పేర్నంబట్ నుంచి వస్తున్న రామస్ బస్సును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు.

ఆరోగ్య సురక్ష–2 ఆరంభం

- రెండో విడతకు శ్రీకారం
- పేదల ఆరోగ్య రక్షణే లక్ష్యం
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా క్యాంపుల నిర్వహణ
- సచివాలయాల వారీగా శిబిరాల ఏర్పాటుకు చర్యలు

చిత్తూరు రూరల్: పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అభయమిస్తోంది. పేదల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్షతో అండగా నిలుస్తోంది. మొదటివిడత సురక్ష క్యాంపులను విజయవంతంగా పూర్తి చేసిన ప్రభుత్వం.. మళ్లీ రెండో విడతకు సిద్ధమైంది. మంగళవారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష–2 హెల్త్ క్యాంపులను సచివాలయ వారీగా నిర్వహించేందుకు సమాయత్తమైంది. గతేడాది సెప్టెంబర్ 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించింది. నవంబర్ వరకు ఈ కార్యక్రమం విజయవంతంగా సాగింది. 1035 చోట్ల శిబిరాలు నిర్వహించారు. 4.50 లక్షల మందికి చికిత్స చేశారు. ఇందులో అధికంగా స్త్రీలు.. 2.40 లక్షల మంది శిబిరాలను సద్వినియోగం చేసుకున్నారు. అలాగే కొత్తగా 15,203 మందికి మధుమేహం, 20,341 మందికి బీపీ, 59,623 మందికి కంటిపరీక్షలు, 70,335 మందికి రక్తహీనత లోపం, 527 మందికి క్షయ, 63 మందికి టీబీ ఉన్నట్లు గుర్తించారు. అయితే మెరుగైన వైద్యం నిమిత్తం 6,683 మందిని ఆరోగ్య శ్రీనెట్‌వర్క్ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

నేటి నుంచి శ్రీకారం

మంగళవారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష –2 ప్రారంభం కానుంది. పక్కా ప్రణాళికతో హెల్త్ క్యాంపుల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొదటి విడతలో గుర్తించిన తప్పిదాలు పునరావృతం కాకుండా దృష్టి పెట్టారు. మండలానికి నెలకు నాలుగు క్యాంపుల చొప్పున ఆరు నెలల పాటు సురక్ష–2 జరగాల్సి ఉంది. వారంలో మంగళవారం లేదా శుక్రవారం, అర్బన్‌లో బుధవారం క్యాంపు నిర్వహించాలని నిర్ణయించారు. అర్బన్‌లో బుధవారం ప్రజల రద్దీ దృష్ట్యా మరుసటి రోజు కూడా హెల్త్ క్యాంపును కొనసాగించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు.



చిత్తూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపు (ఫైల్)

నిర్వహణ ఇలా...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,195 సచివాలయ పరిధిలో నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇందుకు 90 బృందాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు (మంగళవారం) చిత్తూరు జిల్లాలో 19 మండలాలు, తిరుపతి జిల్లాలో 11 మండలాల్లో నిర్వహించనున్నారు. ఒక్కో క్యాంపులో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఒక పీహెచ్‌సీ డాక్టర్ ఉంటారు. పల్లె ప్రాంతాల్లో 92 రకాల మందులు, అర్బన్ ప్రాంతల్లో 152 రకాల మందులను సిద్ధం చేశారు. అత్యవసర వినియోగం కోసం 14 రకాల అందుబాటులోకి తేనున్నారు. అలాగే 7 రకాల వైద్య పరీక్షలను శిబిరంలో చేయనున్నారు ఇక సచివాలయ, వైద్య సిబ్బంది, ఇతర మండల శాఖ అధికారులు సురక్షలో భాగస్వాములు కానున్నారు.



తిరుపతి జిల్లాలో...

విస్తృత అవగాహన

జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా వలంటీర్లు చేస్తున్న సర్వే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 40 శాతం పైగా సర్వే పూర్తయింది. శిబిరం నిర్వహణ వివరాలను వలంటీర్లు, ప్రజాప్రతినిధులు ప్రతి ఇంటికీ ముందు రోజే వెళ్లి తెలియజేస్తున్నారు.

మరింత చేరువయ్యేందుకు...



వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం మరింత చేరువ చేస్తోంది. పల్లె ప్రజలకు వైద్య సేవలకు ఇబ్బంది లేకుండా చూస్తోంది. ఈ సురక్ష జనం ఆరోగ్య రక్షగా మారడంతో మళ్లీ సురక్ష–2కు పురుడు పోసింది. ఇబ్బంది లేకుండా శిబిరాలు నిర్వహిస్తాం. –ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

సురక్షతో బయట పడింది



జగనన్న ఆరోగ్య సురక్షతోనే ప్రజల్లో ఆరోగ్య సమస్యలను గుర్తించాం. ఎక్కువ మంది బీపీ, మధుమేహం, రక్తహీనత తో బాధపడుతున్నారు. వాళ్లంతా హెల్త్ క్యాంపులో చికిత్స చేసుకుని జాగ్రత్త పడ్డారు. ఇదే రీతిలోనే జగనన్న ఆరోగ్య సురక్ష– 2 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. –శ్రీహరి, డీఎంహెచ్, తిరుపతి జిల్లా

విరిగిపడిన విద్యుత్ స్తంభం



తవణంపల్లె : మండలంలోని దిగువ తడకరలో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదవశాత్తు సోమవారం సాయంత్రం విరిగిపడింది. అయితే జనసంచారం లేని సమయంలో పడడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు అప్రమత్తమై వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌లో కరెంట్ సరఫరాను నిలుపుదల చేశారు. దీనిపై సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని స్తంభాన్ని తొలగించారు. మంగళవారం కొత్త స్తంభం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వేటగాళ్ల ఉచ్చుకు యువకుడు బలి



త్యాగరాజులు మృతదేహం

బంగారుపాళెం: మండలంలోని పెరుమాళ్లపల్లెలో అడవి పందుల కోసం వేటగాళ్లు అమర్చిన కరెంట్ ఉచ్చుకు సోమవారం ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన త్యాగరాజులు(35) వేకువజామున తన పొలానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో చంద్రయ్య అనే రైతుకు చెందిన మామిడి తోటలో కొందరు వేటగాళ్లు ఏర్పాటు చేసి కరెంట్ ఉచ్చులో చిక్కుకున్నాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. స్థానిక రైతుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజారావు తెలిపారు.

విద్యను అందిస్తూ.. ఉపాధి కల్పిస్తూ..!

- విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఎల్లసముద్రం ఐటీఐ
- ఏటా 200 మందికి ఉత్తమ శిక్షణ
- వైఎస్సార్ హయాంతో ఏర్పాటు
- అభివృద్ధి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రూ.4.70 కోట్లతో భవన నిర్మాణం



నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ ఐటీఐ భవనం



ప్రస్తుతం రేకు షెడ్‌తో ఉన్న ఐటీఐ

నగరి : విజయపురం మండలంలో తమిళనాడు సరిహద్దులోని మాధవరం పంచాయతీ ఎల్లసముద్రం గ్రామంలో ఉన్న ఐటీఐ (ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ) విశేష సేవలందిస్తోంది. ఒకప్పుడు నగరి, సత్యవేడు నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు ప్రభుత్వ ఐటీఐలో చదవాలంటే 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి వెళ్లాల్సిందే. ఆ సమస్యను 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పరిష్కరించారు. ఇరు ప్రాంతాల వారికి అందుబాటులో ఉండేలా మాధవరంలో ప్రభుత్వ ఐటీఐ ఏర్పాటు చేశారు. వసతుల కల్పనను తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఐటీఐ అద్దె భవనంలోనే కొనసాగుతూ వచ్చింది. వైఎస్సార్‌సీపీ సర్కారు కొలువుదీరిన అనంతరం మంత్రి ఆర్‌కే రోజా దీనిపై దృష్టి సారించారు. ఐటీఐకు సొంత భవనం నిర్మించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు. ఆ మేరకు ఆయన సానుకూలంగా స్పందించి రూ.4.70 కోట్లు మంజూరు చేశారు. నిర్మాణ పనులను ఆరు నెలల్లో పూర్తి చేయించాలని ఆదేశించారు. ఆ మేరకు మంత్రి రోజా పర్యవేక్షణలో భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

ఉత్తమ శిక్షణ

ఐటీఐ ప్రారంభం నుంచి ఇప్పటికి వరకు ఏటా 200 మంది విద్యార్థులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తోంది. విద్యతోపాటు క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా ఉపాధి కల్పిస్తోంది. ఇప్పటి వరకు వేలాది మంది విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసింది.

గొప్ప విషయం

మారుమూల ప్రాంతంలో ఐటీఐ ఏర్పాటు చేయడం గొప్ప విషయం. ఇక్కడ ప్రతి సంవత్సరం 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఉపాధి కల్పిస్తున్నాం. మా విద్యార్థులందరూ ఏదో ఒక సంస్థలో ఉద్యోగం పొంది స్థిరపడ్డారు. ఇప్పుడు నూతన భవనం నిర్మిస్తుండడం సంతోషంగా ఉంది.
గణేష్, ప్రిన్సిపల్, ఐటీఐ, విజయపురం

సంతోషంగా ఉంది



ప్రస్తుతం మేం రేకుల షెడ్డులో చదువుకుంటున్నాం. ఎండకాలం తరగతి గదిలో కూర్చోవడం చాలా కష్టంగా ఉంది. ఇప్పుడు ప్రత్యేక భవనం నిర్మిస్తున్నారు. ఇది మాకు ఎంతో ప్రయోజనకరం. భవన నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి రోజాకు కృతజ్ఞతలు.
- ఎస్.నవీన్, ఐటీఐ విద్యార్థి

వైఎస్సార్‌కు రుణ పడ్డాం



మాది పిచ్చాటూరు మండలం. మా చుట్టు పక్కల ప్రభుత్వ ఐటీఐ లేదు. వైఎస్ రాజశేఖరరెడ్డి మాధవరంలో ఐటీఐ ఏర్పాటు చాలా సంతోషంగా ఉంది. మా విద్యార్థులందరం ఆయనకు రుణపడి ఉన్నాం.
- ఎం.నవీన్, ఐటీఐ విద్యార్థి

ఆనందంగా ఉంది



ఐటీఐ భవనాన్ని ఆదునికంగా నిర్మిస్తున్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు, పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఐటీఐలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారు. ఇక్కడ చదివిన వారికి చక్కగా ఉపాధి కల్పిస్తున్నారు. మాకు చాలా ఆనందంగా ఉంది.
పురుషోత్తం, విద్యార్థి, నాగలాపురం